మూడు తరాలూ ఒకే ఇంట్లో నివసిస్తున్నాయి. ఒక తరానిది సంప్రదాయ వాదం. మరో తరానిది మధ్యే మార్గం. మూడో తరానిది ఆధునిక వాదం. పాతకొత్తల మధ్య నలిగిపోయే రెండోతరానికి 'శాండ్‌విచ్ జనరేషన్' అని పేరుపెట్టారు సైకాలజిస్టులు. పెద్దతరానికి మంకు పట్టు. కొత్తతరానికి ఉడుంపట్టు. వాళ్లను ఒప్పించలేరు. వీళ్లను మెప్పించలేరు. రైలుపట్టాల మధ్య రూపాయి బిళ్లలా, రెండు బ్రెడ్ ముక్కల మధ్య మసాలా పూరణంలా.. మానసికంగా నుజ్జునుజ్జు అవుతున్నది శాండ్‌విచ్ జనరేషన్.

ముత్తాత కట్టించిన ఇల్లు.. సంజీవరావు దంపతులకు దేవాలయం లాంటిదే. చిన్నపాటి పగుళ్లు వచ్చినా భరించలేరు. శ్రీనివాసరావు-పావని దృష్టిలో వారసత్వంగా వచ్చిన చల్లని నీడ అది. మూడోతరానికి మాత్రం హాట్ ప్రాపర్టీ. డెవలప్‌మెంట్‌కు ఇచ్చేస్తే.. కాసులు కురుస్తాయని ఆశ. దాంతో కియా కారు కొనొచ్చు, ఫారిన్ ట్రిప్ వెళ్లొచ్చు. తండ్రి చచ్చినా అమ్మొద్దంటాడు. కొడుకేమో.. తాత చచ్చేలోపు అమ్మేస్తే లిటిగేషన్లు ఉండవని వాదిస్తాడు. మధ్యలో నలిగిపోయేది శాండ్‌విచ్ తరానికి చెందిన శ్రీనివాసరావే. అతనికి అమ్మడం ఇష్టం లేదు. అలా అని ఉన్నది ఉన్నట్టు ఉంచుకోడానికి సిద్ధంగా లేడు. రినొవేషన్ చేయిస్తే అదే పదివేలు అనుకుంటాడు.

సామాజిక..

ఆర్థిక..

రాజకీయ..

సాంస్కృతిక..

ఒకటా రెండా.. అనేకానేక అంతరాలు. ఆ ప్రభావాలు శ్రీనివాసరావును ఒకలా ఇబ్బందిపెడితే, పావనిని ఇంకోలా ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. సాధారణంగా పుట్టిన ఏడాదిని బట్టి ఎక్స్, వై, జెడ్.. తరాలుగా విభజిస్తారు. కానీ శాండ్‌విచ్ జనరేషన్ విషయానికి వచ్చేసరికి.. పైన ఓ తరం, కింద ఓ తరం.. మధ్యలో పచ్చడైపోయే తరాన్ని ఈ పేరుతో పిలుస్తారు మానసిక నిపుణులు. పెద్దల బాగోగులు, పిల్లల పోషణ.. రెండు బాధ్యతలూ వీరివే. ఒకటో తారీఖు వచ్చేసరికి సీనియర్ తరానికి మందులు కొనాలి, జూనియర్ తరానికి పాకెట్ మనీ సర్దాలి. వాళ్ల కాశీ యాత్రకు టికెట్లు బుక్ చేయాలి. వీళ్ల థాయ్‌లాండ్ ట్రిప్‌కు డబ్బులు సమకూర్చాలి. చలికాలం రాకముందే వాళ్లకు కొత్త స్వెటర్లు, వీళ్లకు బ్రాండ్ న్యూ హుడీస్ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేయాల్సిందే. వాళ్ల ఆసుపత్రి బిల్లులు, వీళ్ల స్కూలు-కాలేజీ ఫీజులు.. శాండ్‌విచ్ నాన్న ఖాతా నుంచే వెళ్తాయి. ఇక ఇల్లాలి కష్టాలు ఇల్లాలివి. మూడు తరాలు. మూడు అభిరుచులు. ఒకరికి పథ్యం భోజనం. ఒకరికి బీపీ, షుగర్ డైట్. ఒకరికి వెయిట్‌లాస్ సలాడ్స్. కోరినవారికి కోరిన భోజనం వండిపెట్టాల్సిన బాధ్యత శాండ్‌విచ్ తరం ఇల్లాలిదే. ఈ కుటుంబాల్లో మహిళ పాత్ర.. కత్తి మీద సామే. పెద్దల విషయంలో ఆమె ఎలా వ్యవహరిస్తుంది అనేది బంధువర్గమంతా గమనిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడూ పుట్టింటికి వచ్చే ఆడబిడ్డలకు సకల మర్యాదలూ చేసి, ఏ పట్టుచీరో పెట్టి పంపాల్సిన బాధ్యత ఆమెదే. ఆఫీసు, ఇల్లు.. అదనంగా బంధుగణ సేవ! ఇల్లు అద్దంలా ఉండాలని ఆరాటపడే అత్తమామలు, ఎక్కడి వస్తువులు అక్కడ పడేసే కూతుళ్లూ కొడుకులు.. మధ్యలో నరకయాతన అనుభవించేది ఇల్లాలే.

**ఇవీ లక్షణాలు..**

శాండ్‌విచ్ జనరేషన్ వయసు.. కనీసం నలభైతో మొదలై.. అరవై పైచిలుకు ఉంటుంది. తల్లిదండ్రులతో పాటు అత్తమామల బాధ్యత మోస్తున్నవారూ లేకపోలేదు. మొత్తానికి పెద్ద బరువే. ఫలితంగా ఆర్థిక ఒత్తిళ్లూ ఎక్కువే. జీతం సరిపోకపోవచ్చు. పార్ట్‌టైమ్ జాబ్ అవసరం కావచ్చు. చిన్నాచితకా వ్యాపారాలు చేయాల్సిన పరిస్థితీ ఎదురుకావచ్చు. అంతేనా? యాభై ఏళ్లనాటికి సాధించాలనుకున్న ఆర్థిక లక్ష్యాల్ని అరవై నాటికి కూడా చేరుకోకపోవచ్చు. సొంతింటి కల కలగానే మిగిలిపోవచ్చు. ఫారిన్ ట్రిప్ అసాధ్యం కావచ్చు. వజ్రాల నెక్లెస్ చేయిస్తానని ఇల్లాలికిచ్చిన మాట.. అటకెక్కిపోవచ్చు. రిటైర్మెంట్ ఫండ్.. తరచూ ఐస్‌క్రీమ్‌లా కరిగిపోతూ ఉండవచ్చు. మరోవైపు తోటివాళ్లంతా దూసుకుపోతూ ఉంటారు. రెండో ఇంటి గృహప్రవేశానికి ఇన్విటేషన్లు అందుతాయి. పొరుగింటి మీనాక్షమ్మ రవ్వలహారం చూసి శ్రీమతి భాగ్యశ్రీ నిప్పు రవ్వలా భగభగా మండిపోవచ్చు. వాలంటరీ రిటైర్మెంటు ఆలోచనల్ని పక్కన పెట్టి.. ఓ రెండేండ్లు ఎక్స్‌టెన్షన్ దొరికితే బావుండనే పరిస్థితికి వచ్చేస్తాడు శాండ్‌విచ్ తరం ప్రతినిధి.

**హఠాత్తుగా..**

కొందరు పెద్ద కొడుకు హోదాలో, పెద్ద కూతురు హోదాలో జన్మతః 'శాండ్‌విచ్' అవుతారు. మరికొందరు హఠాత్తుగా ఆ చట్రంలో ఇరుక్కుపోతారు. ఇలియాస్ భాయ్ పరిస్థితే తీసుకోండి. ఇంటికి చిన్న కొడుకు. పైన ఇద్దరు అన్నయ్యలు. భార్య వైపు నుంచి కూడా బాధ్యతలు లేవు. పిల్లలు ఇప్పుడిప్పుడే చేతికొస్తున్నారు. దీంతో బిందాస్‌గా బతికేవాడు. ఆర్థిక కష్టాలే లేవు. అంతలోనే పిడుగుపాటు లాంటి వార్త. పెద్దన్న అమెరికాలోని పిల్లల దగ్గరికి వెళ్తున్నట్టు సమాచారం అందింది. కాస్ట్ కటింగ్‌లో చిన్నన్న ఉద్యోగం పోయింది. డబుల్ బెడ్‌రూమ్ నుంచి సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌కు మారిపోయాడు. దీంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటున్న ఇలియాస్ దగ్గరికి వచ్చేశారు. పిల్లల బెడ్‌రూమ్ పేరెంట్స్ రూమ్‌గా మారింది. నెలవారీ ఖర్చులు పెరిగాయి. మందుల బడ్జెట్ అదనం. వారానికి ఓసారైనా ఫ్యామిలీ డాక్టర్‌కు కన్సల్టేషన్ ఫీజు సమర్పించుకోవాల్సిందే. అమ్మ వైపు చుట్టాలు, నాన్న వైపు బంధువుల రాకపోకలు పెరిగాయి. కాలింగ్‌బెల్ మోగిన ప్రతిసారీ గుండె గుబేలుమంటుంది. ఎవరొస్తారో, ఎన్నాళ్లు ఉంటారో, వెళ్తూ వెళ్తూ ఏం అడుగుతారో?.. అన్నీ ప్రశ్నలే. కుటుంబసభ్యులు ఓ చోట కూర్చుని మనసారా మాట్లాడుకుని ఎన్ని రోజులైందో! ఇల్లాలికైతే క్షణం తీరికలేదు. పనిమనిషి కూడా జీతం పెంచకపోతే కష్టమంటూ సంకేతాలు పంపు



## బ్యాలెన్స్ చేసుకోండి..

**రెండు తరాల మధ్య సంధానకర్త బాధ్యత మనదే అయినప్పుడు, మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎవర్నీ నొప్పించకుండా వ్యవహరించాలి.**

### 1 మాట్లాడండి..

అటు పెద్ద తరంతో, ఇటు చిన్న తరంతో తరచూ మాట్లాడండి. దీనివల్ల అపార్థాలు తొలగిపోతాయి.

### 2 గుర్తుంచుకోండి..

పుట్టినరోజులు, పెళ్లిరోజులు, తాతముత్తాతల పితృకార్యాలు మొదలైనవి గుర్తుంచుకోండి. అవసరమైతే గుర్తుచేయండి.

### 3 మనకోసమూ

ఎన్ని బాధ్యతలున్నా, ఎంత ఒత్తిడి మధ్య నలిగిపోతున్నా.. ఆలూమగలు ఒకరి కోసం ఒకరు సమయం కేటాయించుకోవాలి.

### 4 సూటిగా

కొన్ని విషయాల్లో సూటిగా ఉండటమే మంచిది. మోయలేని భారాన్ని స్వీకరించవచ్చు. అప్పులు తీర్చడానికి మరిన్ని అప్పులు చేయొద్దు.

### 5 వివరించండి

కొత్తతరం అలవాట్ల గురించి పెద్దలకు వివరించండి. పెద్దల్ని చూసుకోవాల్సిన బాధ్యత గురించి పిల్లలకు బోధించండి. కొన్ని విషయాల్లో ప్రాధాన్యం తెలియకపోవడంవల్ల కూడా అపార్థాలు తలెత్తుతాయి.